# ఆదివారం

"పొద్దెక్కినా మహారాజులా ఇంకా ముసుగుతన్ని పడుకున్నారా; లేవండి—లేవండి" బెడ్‌రూమ్‌లో కొస్తూ అంది మాధవి.

శంకరం కళ్ళు ముడుచుకొని లిపాఫలొ ముడుచుకొని ఆ మాటలు వినరానట్టు నటిస్తూ పడుకున్నాడు.

"లేస్తారా ...లేవరా...మార్కెట్ కెళ్ళాలి" అంటూ మంచం దగ్గరి కొచ్చింది మాధవి.

కదలకుండా పడుకున్నాడు శంకరం—

"మీరు దొంగ నిద్ర నటిస్తున్నారని తెలుసుకాని లేవండి. నాకవతల చాలా పనుంది—పిల్లలు లేస్తే పనికానియ్యరు" గట్టిగా అంది.

అయినా శంకరం కదలలేదు...

"లెమ్మంటుంటే మీక్కాదా? మిమ్మల్నెలా లేపాలో నాకు తెలుసు" అని శంకరం పైనున్న దుప్పటి లాగేసింది మాధవి.

"అబ్బా...కాసేపు పడుకోనియ్యవోయ్ నిద్రసరిపోలేదు" కళ్ళనులు ముకుంటూ అన్నాడు శంకరం.

"మీకు నిదర సరిపోలేదా? మీకు రోజుకెన్ని గంటల నిద్రకావాలి బాలాకుమారుడు గారూ? రాత్రి తొమ్మిది గంటలకు పడుకున్నారు...ఏడు కావస్తుంది పది గంటల నిద్ర తక్కువయిందా సార్? అంది అలాగే పడుకున్న శంకరంను లెమ్మని ఊపుతూ.

"లేస్తాను కాని కొంచెమాగవోయ్..." అంటూ కళ్లు మూసుకున్నాడు శంకరం...

"ఇలా అయితే మీరు లేవరు" అంటూ వంటింట్లోకెళ్ళింది...చిన్న గ్లాసులో నీళ్ళు తెచ్చి శంకరం చెవిలో పోసింది, దిగ్గున లేచి కూర్చు

న్నాడు. భార్యలి దిక్కు కోపంగా చూసాడు.

"నీకు మాధవని మీ అమ్మానాన్నలు పెట్టిన పేరు సరైంది కాదు— నీ పేరు కాళీమాతని పెట్టాల్సింది..." కసిగా అన్నాడు చెవిలో పడ్డ నీళ్ళు లుంగీతో తుడుచుకుంటూ...

'తెల్లవారింది లెమ్మంటె నేను మీకు గయ్యాళిలా కనపడుతున్నానా? లేవండి—లేచి మార్కెట్ కెళ్ళిరండి.

"ఆకారంలో కాదులే. తల్లీ చాముండేశ్వరీ! మర్కెట్ కేం కర్మ నువ్వు నరకానికి పొమ్మన్నా పొయ్యొస్తానమ్మా— కాని మరికొద్దిసేపు పడుకున్న తర్వాత. అని వెల్లకిలా మంచంలో ఒరిగాడు శంకరం.

చేయిపట్టి లేపి కూచోబెట్టింది మాధవి.

"నాకూ మారుపేర్లు పెట్టడం తెలుసు. పెట్టమంటారా'' అంది

దిగ్గున జరిగి కాళ్ళు క్రిందికనుకొని మంచంలో కూర్చున్నాడు— మాధవిని తన ప్రక్కన కూర్చొబెట్టి...

"వద్దు మాధవీదేవి గారూ! ఆపని మాత్రం చేయకండి ఈ రోజాది వారం— సెలవుదినమని కొంచెం ఆలస్యంగా లేవాలనుకొంటున్నాను. రోజూ మా బాస్‌గాడి ఉగ్రనరసింహావతారం కళ్ళముందు కదిలి తెల్లవారకముందే తెలివొస్తుంది. ఈ రోజు నువ్వైనా అనుగ్రహించు తల్లీ" అని రెండు చేతులు జోడిస్తూ మంచంలో మఠం వేసుక కూర్చున్నాడు.

"ఈ రోజు ఆదివారమా? అయితేండి? ఈరోజు టిఫిన్ తినరా? కాఫి తాగరా? అన్నం తినరా? ఏం తక్కువ కావాలో చెప్పండి— సరే నేనూ ఆదివారమని పడుకుంటాను సెలవుదినమని ఏం తినకుండా వుంటారా? చెప్పండి శంకరాచార్యులుం గారూ?" అంది మాధవి

జోడించిన చేతులు తీసేసాడు శంకరం. కాళ్ల క్రిందికి చాపుకున్నాడు —"భార్యామణీ! మీ నాన్నగారు నిన్ను మెట్రిక్ వరకే చదివించారు. కాబట్టి బ్రతికిపోయాను ఏ డిగ్రీ వరకో చదివిస్తే నా కొంపలు

మునిగేవి." అంటూ భయం నటించాడు శంకరం.

"కొంపలు ముంచడానికీ చదువుండటమో, లేకపోవడమో అక్కర్లేదు కాని భర్తలుంగారూ! లేచి బుద్ధిగా ముఖం కడుక్కొని శుభ్రంగా టాయిలెటవ్వండి...ఈలోగా టిఫిన్ చేస్తాను—సుష్టుగా టిఫిన్ మెక్కి మార్కెట్ కెళ్ళి సామాన్లవీ తీసుకురండి ఏం కూరలు గూడా లెవ్వింట్లో' అంటూ లేవబోయింది మాధవి.

చేయిపట్టి ప్రక్కన కూర్చోబెట్టుకున్నాడు శంకరం...

"నువ్వు తర్కశాస్త్రం కూడా చదివావన్నమాట. ఆదివారం భర్తతో హాయిగా గడపాలని కోరుకోవాలని కాని మార్కెటుకని, దుకాండ్లోకని తరమడం ఏం బాగుంటుందోయ్? ఎలాగూ లేవడమే కాని ఒక్క పది నిముషాలు, పదంటే పది నిమిషాలు హాయిగా కబుర్లు చెబుతూ పడుకుందాం—" అంటూ మాధవిని బెడ్ పైకి లాగాడు శంకరం.

విసురుగా లేచి నిల్చుంది మాధవి

"మీ సరసం చాలు కాని పిల్లలు లేస్తే టిఫినని గోలచేస్తారు లేవండి' అంటూ వంటింట్లోకెళ్ళింది మాధవి...

ఇక లేవక తప్పలేదు శంకరానికి. లేచి లుంగిసర్దుకుంటూ మాధవి వెంటే వంటింట్లోకెళ్ళి ...

"కాళిమాతగారూ! ఏమేం కావాలో చిన్న కాగితంపై రాసిపెట్టు—"

అన్నాడు. పనిచేసేదాపి గిర్రున వెనుకకు తిరిగింది మాదవి.

"మీరు మాటిమాటికి నన్ను కాళీమాతంటె నేనూర్కోను— నేనూ పేర్లు పెట్టగలను ఇంట్లోక్కావల్సిన వస్తువులు తెమ్మన్నందుకు నేను మీకు దెయ్యంలా కనబడుతున్నానా?" అంది కోపంగా మాధవి.

"సర్లేవోయ్ .. శాంతించు—నిన్నేమనను. కాసీ నాకొక చిన్న సందేహం...ఈ రచయితలంతా ఆడవాళ్లు, ఆడవాళ్ళని వాళ్ళకన్యాయం జరుగుతుందని ఎందుకఘోరిస్తారో నాకు తెలియదు... నా ఉద్దేశ్యంలో

ఆడవాళ్ళ జీవితమే హాయి—నాలాంటి బుద్ధిమంతుడైన మొగుడు దొరుకుతే ఎంచక్కా కాలుమీద కాలేసుకొని సాగించుకోవచ్చు—ఇంట్లో ఏం లేకున్నా మగాడికే బాధ. ఆదివారం కూడా రెస్టుండి చావదు'' అన్నాడు మాధవి దగ్గరికెళుతూ—

''మీ మంచితనం గూర్చి వేరే చెప్పాలా కాని ఒక్క పనిచేయండి. అదేదో ఆపరేషనుందటకదా- అది చేసుకొని ఆడపిల్లయిపోండి—''
అంది మాధవి.

"అబ్బ చంపేసావోయ్.. ఇక నీతో మాట్లాడి లాభంలేదు. అంటూ వంటింట్లోంచి బయటకొచ్చాడు. బ్రష్ వేసుకొని పళ్ళు తోముకుంటూ మళ్ళీ వంటింటిలో కెళ్ళాడు. మాధవి టిఫిన్ చేస్తుంది. మసిలిన నీళ్ళలో ఉప్మా రవ్వ పోసి శంకరంతో అంది—

''ఆదివారం-ఆదివారమంటారు. మీ కాఫీసు కెళ్లాల్సిన పనుండదు... కాని మా ఆడవాళ్ళ సంగతి చూడండి...ఆదివారం కాని, పండుగదినం కాని మాకయితే పని తప్పదు ఆదివారానికున్నా వేరే రోజుకు మాకు తేడే తెలియదు పైగా సెలవు దినమని ఆ స్పెషలని, ఈ స్పెషలని రోజుకంటె ఎక్కువే వండాలి—పిల్లలతో సతమతం కావాలి-మీలాంటి భర్తలుంగార్ల అవసరాలు తీర్చాలి. ఇక ఆడదానికి తీరికెక్కడిదండీ? స్త్రీకి విశ్రాంతి దొరికేదొకేసారి" అంది మాధవి రవ్వను కలుపుతూ...

మాధవి మాటలకు ఆశ్చర్యపోయాడు శంకరం సరదాకే అన్నా అందులోని నిజం ఆతని హృదయానికి తాకింది..అయినా వాట్ని తేలికగానే తీసుకున్నాడు.

''ఎప్పుడోయ్ మీ ఆడవాళ్ళకు విశ్రాంతి దొరికే రోజు ఆ రోజు కోసం వేయికళ్ళతో ఎదురుచూద్దాం" అన్నాడు నవ్వుతూ శంకరం.

ఉప్మా గెన్నె దించి కిందబెట్టి— స్టవ్‌పై నీళ్ళగిన్నె పెట్టింది మాదవి.

''ఆరోజు బొందలో కెళ్ళ్రోజే. ఆ రోజు కోసం చూస్తూండండి... నేం బోతె మీకు సుఖంగా వుంటుంది కదూ!" అంది శంకరంను కొర కొరా చూస్తూ మాధవి.

„ఛా-ఏంటోయ్ ఆమాటలు? నీకేమయిందని అలా మాట్లాడుతున్నావు? ఎంచక్కా వంటింటి సామ్రాజ్యాన్ని మహారాణిలా ఏలుతున్నావు... నీ నోట్లోంచి మాట బయటకు రావడం ఆలస్యం ఏది తెమ్మంటే అది తేవడానికి నేనున్నాను — ఈసారలా మాట్లాడొద్దు. అని మాధవిని దగ్గరకు తీసుకొని ముద్దుపెట్టుకోబోయాడు — పేస్టామె చెంపలకంటింది

''ఏంటీ సరసం వంటింటిలో...వెళ్ళి ముఖం కడుక్కోండి — టిఫిన్ రడీ అయింది" అని శంకరం నుండి విడిపించుకొని బయటకు నెట్టింది.

శంకరం ముఖం కడుక్కొని వచ్చేసరికి టీపాయ్‌పై ఉప్మాప్లేటు పెట్టింది —

„ఏంటోయ్ నేనొక్కన్నే తినాలా.. నువ్వుకూడా తిను....„ అన్నాడు శంకరం ప్లేటు చేతిలోకి తీసుకుంటూ.

"పిల్లల్లేసింతర్వాత వాళ్ళతో కలసి నేను తింటాను కాని మీరు తిని మార్కెటు కెళ్ళండి„ అంది మాధవి ఎదురుగా కూర్చొని.

"ఏంటీ రోజు పిల్లలింకా లేవడం లేదు„ అన్నాడు ఉప్మా తింటూ శంకరం...

"ఏడు గంటల్రాక ఆడారు — అన్నం తిని హోమ్‌వర్క్ చేసుకొని పడుకునేసరికి పదకొండయింది...ఆలస్యంగా లేస్తారు లెండి ...„ అని

''పాలింకా రాలేదేంటబ్బా —'' అంది మాధవి

ఇంతలో తలుపు మీద టకటకమని చప్పుడయింది — తలుపు తీసింది మాధవి. వంటింటిలోకెళ్ళి పాలగిన్నె తెచ్చి పాలుపట్టింది —

"ఈ రోజు ఆదివారం కదా పాలబ్బాయి ఎందుకొచ్చావు?„ అంది శంకరం దిక్కూ ఓరగా చూస్తూ.

ఆ మాటలు వింతగా అన్పించాయి పాలబ్బాయికి...

"ఆదివారమా? అయితేందండి? మేం వారాల గురించసలు పట్టించుకునే పట్టించుకోము—నాలుగువేళ్లు నోట్లోకెళ్ళడానికి ఏ రోజయినా సరే తెల్లవారింది మొదలు పని చేయడం తప్పదు.." అంటూ వెళ్లిపోయాడు పాలబ్బాయి.

భర్త దిక్కు చూస్తూ ఇంట్లో కెళ్ళింది మాధవి. పాలగిన్నె స్టవ్‌పై పెట్టొచ్చి శంకరం కెదురుగా కూర్చుంది—

ఉప్మా తినడం ముగించాడు శంకరం.

"విన్నారు గదా పాలబ్బాయి మాటలు! సెలవుదినాలెవరికి—? కడుపు నిండిన వాళ్లకే. పాలబ్బాయిలాంటి వాళ్లు పనిచేయకుంటే వెళ్లదు—ఏ రోజు కానీ—పండుగని పబ్బమని సంబంధంలేదు" అంది మాధవి.

"శ్రీమతిగారూ! మీరీ మధ్య సమాజం గూర్చి బాగా ఆలోచిస్తున్నారు కథలు రాయడం నేర్చుకుంటే సామాజిక స్పృహగల రచయిత్రివి కావడం గ్యారంటీ" అన్నాడు లేచి నిలబడుతూ శంకరం.

"ఆ స్పృహల సంగతి నాకు తెలియదు కాని— కళ్లెదుట కనబడుతున్న విషయాల గూర్చి చెప్పడానికి రచయిత్రే కానక్కర్లేదు—కూలి నాలితో బ్రతికేవారికి, రెక్కల కష్టంతో జీవించేవారికి ఆదివారాల సంగతేం తెలుస్తుందో చెప్పండి? అలాగే ఆడవాళ్ళకూ కూడా ... కాదంటారా? మీరే చెప్పండి" అంది మాధవి లేచి నిలబడి ..

మాధవి మాటలు విని ఆశ్చర్యపోయాడు శంకరం...ఏం మాట్లాడకుండా బెడ్‌రూమ్‌లో కెళ్ళాడు మాదవి వంటింట్లో కెళ్ళింది... డ్రెస్ చేసుకొని వంటింట్లో కొచ్చాడు శంకరం — టీ వడబోస్తున్న భార్య భుజంపై చేయివేస్తూ—

"నీకిన్ని విషయాలెలా తెలుసోయ్"? అన్నాడు

"ఇందులో తెల్సుకోవడానికి కష్టపడాల్సినంత బ్రహ్మ విద్యేముంది?

రోజూ కళ్ళముందు కనబడుతున్నదేగా మా నాన్న రైతు...ఆయనే రోజూ విశ్రాంతి తీసుకోగా నేను చూల్లేదు. లేచింది మొదలు పని-పని -పని మిమ్మల్ని మార్కెట్ కెళ్ళి సామాను తీసుక రమ్మంటె నన్ను గయ్యాలంటున్నారు'' అంది టీ కప్పు శంకరం చేతికిస్తూ ముందు రూంలో కూర్చొని టీ చప్పరిస్తున్నాడు శంకరం మాధవి సామాన్ల లిస్టురాసి అతని చేతికిచ్చింది...

"అయితే నాలాంటి ఉద్యోగులు సుఖపడుతున్నారంటావా"?

"అని నేనడం లేదు—కాని మాకంటె మీపని నయమే „

"ఏం నయమోయ్? ఇంట్లోకే వస్తువు తక్కువయినా మాకేబాధ... ఆఫీసున్న రోజుల్లో ఉరుకులు పరుగులేనాయె — సెలవు రోజుల్లో ఎన్ని చూసుకోవాల్సుంటుంది...మార్కెట్ కెళ్లాలి. పెండింగ్ పనులు చూసుకోవాలి...ఆర్థిక ఇబ్బందులు పిల్లల అవసరాలు — చేబదుల్లు...మన్ను మసానం—ఎంజాయ్ చెయ్యడానికి కావాల్సినంత డబ్బుండి చస్తేకదా?" అంటూ టీ కప్పు టిపాయ్ మీద పెట్టి లేచాడు.

"అందుకే అంటున్నాను కడుపునిండున్న వాళ్ళకే ఆదివారాలు, సరదాలూను — చాలీ చాలని ఉద్యోగాలు చేస్తున్నవాళ్ళు ఆఫీసులేని సమయాల్లో ఎంతో కొంత సంపాదించడానికి ఏదో పనులు చేయడం లేదా? సరె కాని మార్కెట్ కెళ్ళిరండి. అంది లేచి నిల్చొని—

"పోతాను కాని మాధవీ నాకొక చిన్న డౌట్—ఇల్లే స్వర్గంగా భర్తే దైవంగా, పిల్లలే లోకంగా భావిస్తూ...నాలుగు గోడల మధ్యే కాలం గడిపే నీకిన్ని విషయాలెలా తెలుసు...?„

"ఈ విషయాల గూర్చి తెలుసుకోవడానికి ప్రపంచం మీద పడి తిరగాల్సిన పనేం లేదు. కాస్త ఇదుంటే చాలు—" అని తలమీద వేళ్ళతో కొట్టుకొని చూపించింది వంట గదిలో కెళ్తూ—

"అంటే నాకు మెదడు లేదంటావా...„? అంటూ మాధవి వెనకాలే

నడిచాడు శంకరం—

"నేనా మాటన్నానా—? మీకే అనుమానంగా వున్నట్టుంది— ఓ సారి డాక్టర్ గారి దగ్గరికెళ్ళి చూపించుకోండి" అంది నవ్వుతూ మాధవి

"నిన్ను-నిన్ను. ఏం చేస్తానో వుండు" అని మాధవిని రెండుచేతుల్లో ఇముడ్చబోయాడు శంకరం—

"అమ్మా అమ్మా.. అంటూ వచ్చిన బాబు, పాపలను చూసి ఆగిపోయాడు. బుట్టి, సంచి తీసుకొని బయటకెళ్ళాడు... బజారు కెళ్తున్న శంకరం భార్య మాటల గూర్చి ఆలోచిస్తున్నాడు. 'అవును. నవ్వుతూనే అన్న మాధవిమాటల్లో ఎంత సత్యముంది?కష్టజీవికి, స్త్రీకి రోజూవిశ్రాంతనేది లేదు. తనలాంటి వాళ్ళకున్న ఆర్థిక ఇబ్బందులుండనే వున్నాయి. అన్ని వసతులున్న వారికి ఆర్థికంగా వున్నవారికి తలుచుకున్నప్పుడల్లా సెలవు దినాలే...ఎంత పరిశీలనా జ్ఞానం కలది మాధవి. మాధవి చాలా తెలివైంది—'

బజార్లో పని ముగించుకొని సామాన్ల సంచులతో ఇంటికెళ్ళాడు. శంకరం—శంకరం ఇంట్లోకెళ్ళేసరికి ఇద్దరు పిల్లలతో వంటింటిలో భరతనాట్యం చేస్తుంది మాధవి.